

‘లెక్క’ చూపాల్సిందే..
ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో డబ్బు రవాణాపై నిఘా పెట్టారు. రూ.50 వేలకు మించితే ఆధారాలు చూపాల్సిందే. 10లో



మేనిఫెస్టో విడుదలైతే పండుగే..
ఈ నెల 15న సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించనున్నారని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. 12లో



వాతావరణం
జిల్లాలో గురువారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటగంటకూ ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



ప్రవచనం చేస్తున్న దేవనాథ జీయర్ స్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనం వైభవంగా జరిపించారు. ప్రతీ బుధవారం ఉత్సవమూర్తులకు ఈ వేడుక నిర్వహిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, అంతరాలయంలో దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో ప్రవచనం చేశారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి ఔన్నత్యాన్ని, పాలనా దక్షతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

14 నుంచి రెజ్లింగ్‌లో శిక్షణ

కొత్తగూడెంటౌన్: ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు బాలబాలికలకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రీ ఇంక్లెన్స్‌లోని తెలంగాణా క్రీడా మైదానంలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని, బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కోచ్‌గా రెజ్లింగ్ సీనియర్ క్రీడాకారిణి పెదపాటి నీహారిక వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయండి

కలెక్టర్ ప్రియాంక ఆల



డేటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగిస్తున్న సిబ్బంది

కొత్తగూడెంటౌన్: శాసనసభ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ పర్సనల్ డేటా ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఎన్నికల విభాగం అధికారులకు సూచించారు. బుధవారం ఐడీఓసీలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1095 పోలింగ్ కేంద్రాలకు రిజర్వ్ సిబ్బందితో కలిపి దాదాపు 5,300 మంది అవసరమని తెలిపారు. కాగా, డేటా ఎంట్రీ ప్రక్రియను ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, డీటీ రంగప్రసాద్, ఎస్‌వీసీ డీఐఓ సుశీల్‌కుమార్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ పరిశీలించారు.

అత్యవసర చికిత్స భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు



భవన నిర్మాణ స్థలాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అత్యవసర చికిత్స విభాగం భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద జిల్లా కేంద్రంలో 50 పడకల అత్యవసర విభాగం నిర్మించేందుకు ఈ ఏడాది జూన్‌లో రూ.23.75 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.12.75 కోట్లతో మూడంతస్తుల భవనం నిర్మించాల్సి ఉంది. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలోని స్థలంలో నిర్మాణానికి అధికారులు అనుమతి ఇవ్వగా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలోని 20 అత్యవసర కేంద్రాల నిర్మాణాలకు ఇటీవల వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

పోడు కేసులకు మోక్షం

- ఎత్తివేతకు అటవీ అధికారుల కసరత్తు
- ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణ
- జిల్లాలో 227 కేసులు నమోదు



ఘర్షణ పడుతున్న పోడు రైతులు, అటవీ సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: పోడు భూముల ఆక్రమణ ఘర్షణల్లో నమోదైన కేసుల నుంచి గిరిజనులకు మోక్షం కలగనుంది. ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పోడు విషయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించగా.. ఈ మేరకు అటవీశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ముందుకొచ్చిన ప్రభుత్వం.. అర్హులకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు 2021 నవంబర్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో పోడు పట్టాల కోసం 83,341 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఈ ఏడాది మార్చిలో వచ్చిన పోడు దరఖాస్తులపై డీఎల్‌సీలో తీవ్ర స్థాయిలో కసరత్తు చేసి అర్హుల జాబితాను ప్రకటించారు. జిల్లాలో 1,51,195 ఎకరాల పరిధిలో 50,595 మందికి లబ్ధి చేకూర్చారు. వారికి రైతుబంధు అమలుతో పాటు నమోదైన కేసులు కూడా ఎత్తివేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 227 కేసులు..
జిల్లాలో 21 మండలాల పరిధిలో పోడు భూములు విస్తరించి ఉన్నాయి. 313 గ్రామ పంచాయతీల పరిధిలో 717 ఆవాస గ్రామాల్లో గిరిజనులు, గిరిజనేతరులు పోడు సాగు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 2.98 లక్షల ఎకరాల అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలింది. ఇందులో ప్రధానంగా గుండాల, టేకులపల్లి, ఇల్లెందు, ఆళ్లపల్లి, అశ్వారావుపేట, దుమ్ముగూడెం, చర్ల, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో పోడు సమస్య తీవ్రంగా ఉంది. ఈ పది మండలాల్లో 2.09 లక్షల ఎకరాల్లో పోడు భూములు సాగులో ఉన్నాయి. 2015 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమం సందర్భంగా పోడు గొడవలు జరుగుతున్నాయి. తరచూ అటవీ భూములపైకి వెళ్తున్న గిరిజనులకు అటవీ శాఖ సిబ్బందికి వాగ్వాదాలు జరగడం పరిపాటిగా మారింది. 2021 వరకు ఈ పోడు భూముల సమస్య అత్యంత జఠిలంగా మారింది. దాడులు, ప్రతి దాడులతో పోడు భూముల్లో పలుమార్లు రక్తపుటేరులు పారాయి. 2015లో చంద్రుగొండ మండలం అబ్బుగూడెం పరిసర ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలో అటవీశాఖ అధికారులపై గిరిజనులు రాళ్లు, కర్రలతో తిరగబడిన ఘటన సంచలనంగా మారింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది పోడు ఘర్షణలు జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి. దీన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు అందజేసింది. ఇక జిల్లాలోని ఆరు అటవీ డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు 5,382 మందికి పోడు ఘర్షణల్లో ప్రమేయం ఉన్నట్లు తేలింది. వాటి పరిధిలో నమోదైన 227 కేసులను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలోని అటవీ డివిజన్ల వారీగా కేసుల వివరాలిలా..

కొత్తగూడెం	26
పాల్వంచ	77
మణుగూరు	64
భద్రాచలం	41
కిన్నెరసాని	19

(ఇల్లెందు డివిజన్‌లో కేసులు నమోదు కాలేదు)

ప్రభుత్వ ఆదేశాల మేరకే



ప్రభుత్వం పోడు వివాదాల్లో నమోదైన కేసులను ఎత్తివేయాలని నిర్ణయించింది. దానిలో భాగంగా ఇప్పటికే జిల్లాకు చెందిన కేసుల వివరాలను ప్రభుత్వానికి పంపాం. పోడు భూముల ఆక్రమణ విషయంలో జిల్లా వ్యాప్తంగా గిరిజనులపై 227 కేసులు నమోదయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేసులను ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – కిష్టాగౌడ్, డీఎఫ్‌ఓ

వాటాలు తేలక దళిత ‘బంద్’

- జిల్లా అధికారులకు చేరని లబ్ధిదారుల జాబితా
- పంపకాలు కుదరక ఎంపిక ఆలస్యం
- ముగిసిన ఆన్‌లైన్ గడువు
- అశ్వారావుపేటలో ఎవరికీ అందని ఆర్థిక సాయం

అశ్వారావుపేట: రాష్ట్రవ్యాప్తంగా దళితులను ప్రసన్నం చేసుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరుల కమీషన్ల కక్కుర్తితో అభాసుపాలయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దళితులను ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉంచేందుకు తీసుకొచ్చిన ఈ పథకం దళితేతర నాయకులకు గతంలో కాసులు పండించింది. ఇక రెండో విడతలోనూ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే అనుచరులు వసూళ్లకు పాల్పడ్డారు. రూ.10 లక్షలు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో దరఖాస్తులు వెల్లువెత్తాయి. దీంతో ఎమ్మెల్యే అనుచరులు, ఓ సమీప బంధువు కలెక్షన్లకు తెరలేపారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలో 1100 యూనిట్లు మంజూరు కాగా, దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. దీంతో అందరికీ సమానంగా(ఒక యూనిట్ ఇద్దరు లేదా ముగ్గురికి) పంపిణీ చేయాలని, మళ్లీ తర్వాత విడతల్లోనూ అందరికీ ఇవ్వాలని ఎమ్మెల్యే తన అనుచరులకు చెప్పినట్లు సమాచారం. ఇందుకు దరఖాస్తుదారులు ఒప్పుకోకపోవడంతో పెండింగ్‌లో పడింది. దీంతో అసలు లబ్ధిదారుల జాబితా అధికారులకు అందకపోవడంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేప్పుడు ఈ నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ పథకం అందలేదని సమాచారం.

వసూళ్ల కోసమే ఆలస్యం..
దళిత బంధు లబ్ధిదారుల జాబితాను మార్చేందుకు అశ్వారావుపేటకు చెందిన ఓ నాయకుడు ప్రయత్నం చేయడంతో విషయం బయటపడింది. ఈ మేరకు ‘సాక్షి’లో కథనం కూడా ప్రచురితమైంది. ఇలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఎమ్మెల్యే అనుచరులు దళితబంధు లబ్ధిదారుల తుది జాబితాను అధికారులకు అందించడంలో విఫలమయ్యారని తెలుస్తోంది. ఓవైపు దళితులు తమకు దళితబంధు సాయం రూ.10 లక్షలు ఎప్పుడు అందుతాయా ? అని ఎదురు చూస్తుండగా పూర్తిగా బ్రేక్ పడనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ఎమ్మెల్యే అనుచరుడికి యూనిట్‌కు రూ. 2 లక్షలు, ఓ పెద్దాయనకు రూ.2 లక్షలు, అధికారులకు కొంత.. మిగిలింది లబ్ధిదారులకు అన్నట్టుగా పంచుకున్నారు. ఈసారి ముందుగానే చెక్కులు వసూలు చేశారు. అశ్వారావుపేట మండలం నారాయణపురంలో ఓవ్యక్తి తనకున్న కారు తాకట్టు పెట్టి లంచం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరో వ్యక్తి యూనిట్ల లాబీయింగ్ పనిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. చివరకు లంచాలు ఫైనల్ కాకపోవడంతో ఆశలు పెట్టుకున్న దళితులకు మొండిచేయి చూపిస్తారనే ఆందోళనలో దరఖాస్తుదారులు ఉన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును ‘సాక్షి’ వివరణ కోరగా లబ్ధిదారుల జాబితా తయారీలో జాప్యం జరిగిందని, ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని చెప్పారు.

మెడికల్ కళాశాలలో 13 మందికి మెమో?

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 13 మంది రెగ్యులర్ ఉద్యోగులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నెల 5న మెడికల్ కళాశాలలో డీఎంఎల్‌టీ పరీక్షలు నిర్వహించారు. వీటి నిర్వహణలో ఇన్విజిలేటర్లుగా నాలుగో తరగతి ఉద్యోగులను కేటాయించారు. ఈ విషయమై రెగ్యులర్ ఉద్యోగులు ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విషయం పత్రికల్లో వచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన ఇది బయటకు ఎలా వచ్చిందంటూ 13 మందికి మెమో ఇచ్చినట్లు తెలిసింది. ఇందులో ఒకరు అసిస్టెంట్ డైరెక్టర్, ఇద్దరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితరులు ఉన్నట్లు సమాచారం.

ఎన్నికల విధుల్లో సమన్వయం పాటించాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



కొత్తగూడెం అర్బన్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్: రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులంతా సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్, అశ్వారావుపేట నియోజకవర్గ ఈఆర్‌ఓ పర్సా రాంబాబు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సిబ్బందికి కేటాయించిన విధులు అప్రమత్తతతో నిర్వహించాలని సూచించారు. అనంతరం నోడల్ అధికారి, పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గం ఏపీ సరిహద్దులో ఉండటంతో అక్రమంగా నగదు, మద్యం రవాణా చేసే అవకాశాలు ఉంటాయని, అందుకే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తక్షణమే ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే తొలగించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంటే తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని, లేదంటే ఆ నగదును జప్తు చేస్తామని చెప్పారు.

16 నుంచి ‘ఓపెన్’ పరీక్షలు
కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి ఓపెన్ పది, ఇంటర్ థియరీ పరీక్షలు జరుగుతాయని అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం వివిధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థుల కోసం చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ విద్యార్థులకు సింగరేణి హై స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పదో తరగతి పరీక్షలకు 209 మంది, ఇంటర్ పరీక్షలకు 137 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతిసెంటర్‌లో సిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, పోలీసు బందోబస్తు ఉంటాయని వివరించారు. ఆయా కేంద్రాల్లో వైద్యసిబ్బంది, తాగునీరు, టాయిలెట్ల పరిశుభ్రత, నిరంతర విద్యుత్‌సరఫరా, ఫర్నిచర్ ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, డీఐఈఓ బి.సులోచన, వివిధ శాఖల అధికారులు సుకృత, రంజితకుమార్, చందర్, డి.రామకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ సంపదను కొల్లగొడుతున్నారు..

- ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం
- కేసీఆర్‌కు తొత్తులుగా పోలీసు, రెవెన్యూ అధికారులు
- బీసీలకు 60 – 70 సీట్లు కేటాయిస్తాం
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్



కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, పార్టీ అభ్యర్థి కామేష్ తదితరులు

కొత్తగూడెం అర్బన్: ఏజెన్సీ సంపదను అగ్రవర్ణాల ఖాతాల్లోకి మళ్లిస్తూ గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఉద్యోగులకు నెలనెలా వేతనాలు, ఆసరా పింఛన్లు ఇవ్వలేక చతికిల పడుతోందని ఎద్దేవా చేశారు. కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పోడుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్నాయని, వారికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వడంలో మాత్రం వివక్ష చూపుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము బీసీలకు 60 నుంచి 70 అసెంబ్లీ సీట్లు ఇస్తామని ప్రకటించారు.

భూదందాపై విచారణ చేయాలి..
పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇసుక అక్రమ ర్యాంపులు, భూదందాలపై విచారణ జరపాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తనయుడు రాఘవ అధికార అహంతో రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నాడని, ఓ కుటుంబంలో నలుగురి ఆత్మహత్యకు కారకులయ్యాడని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పి యువకుడు, విద్యావంతుడైన యెర్రా కామేష్‌ను గెలిపించాలని కోరారు. చావులు, పెళ్లిళ్లకు రూ. 5000 ఇచ్చే వారిని నమ్మి మోసపోవద్దన్నారు.

జిల్లాపై పట్టింపేది ?
భద్రాచలం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.100 కోట్ల నిధులు ఏమయ్యాయని ఆర్‌ఎస్పీ ప్రశ్నించారు. భద్రాద్రి రామయ్యను కన్నెత్తి చూడని తండ్రీకొడుకులు కేసీఆర్, కేటీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తానన్న సీఎం హామీలు అటకెక్కాయని విమర్శించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరందించే కాళేశ్వరం ప్రాజెక్టును ఆగమేఘాల మీద పూర్తి చేసిన ప్రభుత్వం, సీతారామా ప్రాజెక్టును సకాలంలో ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఎస్టీల భూములు లాక్కున్నా, దళిత, బీసీ బంధు పథకాల్లో కమీషన్లు అడుగుతున్నా ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాల్లా మిన్నకుండిపోతున్నారని విమర్శించారు. అంతకు ముందు కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం అసెంబ్లీ అభ్యర్థి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బండి రమణి, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు, సాయి, సిర్ల మణిసాయి, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజం మర్చిపోయిన కామ్రేడ్లు

చంద్రుగొండ: కమ్యూనిజాన్ని మర్చిపోయిన కామ్రేడ్లు సీట్ల కోసం దొరల గడీల దగ్గర కాపలా కాస్తున్నారని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. చంద్రుగొండలో పార్టీ కార్యకర్త కంచర్ల రాములు కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చే సీట్ల కోసం ఫామ్‌హౌస్ వద్ద పడిగాపులు కాశారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తలుపు తడుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ డబ్బు, మద్యం భారీగా పారించబోతోందని, తాము అధికారంలోకి రాగానే బెల్ట్‌షాపులు రద్దు చేస్తామన్నారు. ఈ సారి రాష్ట్రంలో తమకు అధికారం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యాన తోటల సందర్శన



కూరగాయల తోటలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అల్లిగూడెం గ్రామ సమీపంలోగల ఉద్యాన తోటలను స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. నాలుగో సంవత్సరం విద్యార్థులంతా ఏఈఎల్‌పీ(అగ్రికల్చరల్ ఎక్స్‌పీరియన్సియల్ లెర్నింగ్ ప్రోగ్రాం)లో భాగంగా స్థానిక రైతు ముళ్లపూడి చలపతికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బీర, సొరకాయల సాగు విధానం, పాటించాల్సిన జాగ్రత్తలు, పెట్టుబడులు, కాయ కోత విధానం, మార్కెటింగ్, దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ నీలిమ, డాక్టర్ టి.పావని, డాక్టర్ దీపక్ రెడ్డి, డాక్టర్ శిరీష, డాక్టర్ జంబమ్మ, డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

నిలిచిన డయాలసిస్ సేవలు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో బుధవారం రెండు గంటలపాటు డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర అవస్థ పడ్డారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనరేటర్ సక్రమంగా పనిచేయడంలేదు. దీంతో సేవలు రెండు గంటల పాటు ఆగిపోయాయి. ఆస్పత్రికి, డయాలసిస్ విభాగానికి ఒకే జనరేటర్ ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరో జనరేటర్ ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు.



డయాలసిస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న బెడ్లు

ఇంకా అవకాశం ఉంది!

- ఓటు నమోదుకు 31వరకు గడువు
- తొలగింపులు మాత్రం ఉండవు..

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల సంఘం అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించింది. గతనెల 19వ తేదీ వరకు గడువు ఉండగా, ఈనెల 4వ తేదీన ఓటర్ల తుదిజాబితా విడుదల చేశారు. అయితే, ఇంకా నమోదు చేసుకోని వారెవరైనా ఉంటారనే ఆలోచనతో ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

మేలుకోండి ఇప్పటికైనా..
అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారే కాక ఇప్పటివరకు ఓటు హక్కు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే వారిని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమవుతుంది. అలాగే, మంచి నాయకులను ఎన్నుకోవాలంటే అందరికీ ఓటు హక్కు కలిగి ఉండడమే కాక ఓటు వేయడం తప్పనిసరి. అందుకే అర్హులు నిర్లక్ష్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ఓటు హక్కు లేని వారంతా ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే రానున్న శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఇలా తెలుసుకోవచ్చు

ఓటు ఉందా లేదా అనే వివరాలను తెలుసుకునేందుకు వివిధ రకాల వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన వెబ్‌సైట్‌లు www. nvsp. in, voters. eci. gov. inతో పాటు రాష్ట్రానికి సంబంధించి www. ceotelangana. nic.in వెబ్‌సైట్‌లోనే కాక ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. అంతేకాక కంట్రోల్ రూం 1950 నంబర్‌కు ఫోన్ చేసినా సమాచారం ఇస్తారు. కాగా, ఓటు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, చిరునామా మార్పునకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా.. పూర్తిగా పేరు తొలగింపునకు మాత్రం ఇప్పుడు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.



క్లుప్తంగా

ఎన్నికల కోడ్ అంబులెన్స్‌కు వర్తించదా?



అంబులెన్స్‌పై కనిపిస్తున్న సీఎం కేసీఆర్ చిత్రపటం

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండే 108 అంబులెన్సులపై సీఎం కేసీఆర్ బొమ్మ ఉండగా, కనిపించకుండా స్టిక్కర్లు అంటించారు. కానీ రెండు అంబులెన్స్‌లపై స్టిక్కర్లు అంటించకుండా వదిలేశారు. అధికారులు స్పందించి కేసీఆర్ చిత్రపటాన్ని తొలగించాలని పలువురు ఆరోపిస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కొమరం రమేష్(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు సారా పట్టివేత

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక, పెద్దనల్లబల్లి గ్రామాల్లో బుధవారం సుమారు 80 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కునుకు సాగర్, భూక్యా రవిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐలు గణేష్, కేశవరావు తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

పాల్వంచరూరల్: లారీ నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కారేపల్లి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ముప్పారపు శ్రీనివాసరావు(58) ఈ నెల 8న జామాయిల్ కర్రల లోడ్‌తో సారపాక ఐటీసీకి వెళ్లాడు. తిరిగి లారీ నడుపుకుంటూ వస్తుండగా మంగళవారం రాత్రి పాల్వంచ మండలం రంగాపురం గ్రామ శివారులో గుండెపోటు రావడంతో అదుపు తప్పి లారీ రోడ్డు పక్కన చెట్లపొదలోకి వెళ్లింది. అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించి ఆటోలో ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ గుడికంట్ల సుధాకర్ తెలిపారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో గోదావరి ఒడ్డు పొలాల్లో రెండు విద్యుత్ మోటార్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయగా, బుధవారం రైతులు గుర్తించారు. వారం రోజుల వ్యవధిలో రెండు మోటర్లను దొంగిలించారు. గతంలో మొండికుంట, మల్లెలమడుగు, నెల్లిపాక ప్రాంతాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు, విద్యుత్ మోటర్లు, ట్రాక్టర్ల సామగ్రి చోరీలు జరగాయి. మళ్లీ వరుస దొంగతనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

దమ్మపేట: బైక్, ట్రాక్టర్ ఢీకొని ఒకరు గాయపడ్డ ఘటన మండలంలోని మొద్దులగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... బుధవారం రాత్రి పామాయిల్ లోడ్ ట్రాక్టర్ మండలంలోని మొద్దులగూడెం క్రాస్ రోడ్డు మీదుగా అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. అదే సమయంలో చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన మట్ల రామకృష్ణ బైక్‌పై సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో క్రాస్ రోడ్డు దాటగానే ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుజాతనగర్: ట్రాలీ వాహనాన్ని వెనుక నుంచి ఓ ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. నాయకులగూడెం గ్రామానికి చెందిన దండు దివాకర్, దండు రవి ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వైపు వెళుతున్నారు. స్థానిక రైల్వే వంతెన దాటిన తర్వాత వారి ముందు వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దివాకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

‘లెక్క’ చూపాల్సిందే..

- ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసుల నిఘా
- జిల్లాలోని ప్రధాన మార్గాలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు
- ఆధారాలు చూపకుంటే తరలిస్తున్న నగదు స్వాధీనం
- ఒక్కరోజే రూ.7.55 లక్షలు పట్టుకున్న అధికారులు
- నగదు తాయిలాల నిరోధంపై ఎన్నికల సంఘం దృష్టి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: ఇప్పటివరకు ఎంత మొత్తం నగదు ఎటు తీసుకెళ్లినా ఎవరూ అడగలేదు. ఇక నుంచి తమతో తీసుకెళ్తున్న నగదుకు పక్కాగా లెక్క చూపాల్సిందే. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం విదితమే. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లినా, బంగారం తరలించినా ఆధారాలు చూపాలి. లేకపోతే పోలీసులు నగదు స్వాధీనం చేసుకుంటున్నారు. గత సోమవారం నుంచి కోడ్ అమల్లోకి రాగా పోలీసులు నిఘా పెంచారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

ఒక్కరోజులో రూ.7.55 లక్షలు..

జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు మంగళవారం ఒక్కరోజే దాదాపు రూ.7,55,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకుండా వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీస్ అధికారుల చెబుతున్నారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో రూ.1,20,000 నగదు కారులో తరలిస్తుండగా సీఐ ఎం.కరుణాకర్ పట్టుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అశ్వారావుపేటలోని నందమూరి నగర్‌లో కారులో తరలిస్తున్న రూ.4,51,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలంలో ఏఎస్పీ పరితోష్ పంకజ్ రూ.17,400 పట్టుకున్నారు. ఎవరైనా అధిక మొత్తంలో నగదు, బంగారం, ఇతర సామగ్రిని తరలిస్తే వాహనంతో పాటు వ్యక్తులను అదుపులోకి తీసుకుంటామని, ఆధారాలను చూపిస్తే ఎలక్షన్ తర్వాత వారికి తిరిగి అందజేస్తామని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఆధారాలు చూపించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

28 పోలీసు స్టేషన్ల పరిధిలో పటిష్ట నిఘా

జిల్లా వ్యాప్తంగా కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, సూజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, జూలూరుపాడు మండలాలతోపాటు జిల్లాలోని 28 లా అండ్ ఆర్డర్, రెండు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలోని చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల వెంట పోలీసులు నిఘా పెంచారు. తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం వన్, టూటౌన్, త్రీ టౌన్, చుంచుపల్లి విద్యానగర్, ఇల్లెందు క్రాస్ రోడ్, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ తదితర ప్రాంతాల్లో వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

- రూ.50 వేలకు మించి మీ జేబులో ఉంటే ఆధారాలు ఉండాలి. లేదంటే సీజ్ చేస్తారు.
- నగదు, బంగారం ఇతర వస్తువుల తరలింపుపైనా ఆంక్షలు ఉన్నాయి.
- అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, శుభకార్యాలు ఇతర అవసరాలకు అధిక మొత్తం నగదు తీసుకెళ్లేవారు లావాదేవీలకు సంబంధించిన తగిన ఆధారాలను దగ్గర ఉంచుకోవాలి.
- ఆస్పత్రిల్లో చెల్లింపుల కోసం ఎక్కువ మొత్తంలో నగదు తీసుకువెళ్తే రోగి రిపోర్టులు, ఆస్పత్రి రసీదులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి.
- వస్తువులు, ధాన్యం, విక్రయం డబ్బు సొమ్ము అయితే సంబంధిత రశీదులు చూపాలి.
- ఏదైనా అవసరాల నిమిత్తం పెద్ద మొత్తంలో నగదు డ్రా చేస్తే ఖాతా బుక్, లేదా ఏటీఎం వంటివి తప్పని సరిగా దగ్గర ఉండాలి.
- భూమిని విక్రయించిన సొమ్ము అయితే దస్తావేజులు చూపాలి.
- వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే అందుకు సంబంధించిన ఆధారాలతో అధికారులకు చూపాలి.
- ఎక్కువ మొత్తంలో నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు కూడా అడుగుతారు. ఆధారాలు చూపిస్తే మళ్లీ తిరిగి ఇస్తారు.

నిబంధనలు పాటించాలి



ఎన్నికల నిబంధనలు అందరూ పాటిస్తూ పోలీసులకు సహకరించాలి. రూ.50 వేలకు మించి నగదు దగ్గర ఉంటే తనిఖీల సందర్భంగా ఆధారాలను చూపాలి. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో నిఘా పటిష్టం చేశాం. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. నగదు పట్టుబడ్డా ఆధారాలు చూపితే వదిలేస్తున్నాం. ఆధారాలు లేకపోతే స్వాధీనం చేసుకుంటున్నాం. ఎవరైనా నగదు, బంగారం అక్రమంగా తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

–ఎం.కుమారస్వామి, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ

రూ.2 లక్షలు సీజ్

పాల్వంచ: పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం లారీ అసోసియేషన్ హాల్ వద్ద ఎస్‌ఐలు బి.రాము, రాఘవయ్య, చందు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సోములగూడేనికి చెందిన ఓ కూల్ డ్రింక్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ బాలినేని జగదీష్ కారులో రూ.2 లక్షలు తీసుకెళ్తున్నాడు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు.

సరిహద్దులో రూ.2.30 లక్షలు..

అశ్వారావుపేటరూరల్: సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. శీలం శ్రీనివాస్ అనే వ్యక్తి ఏపీలోని దేవరపల్లి నుంచి భద్రాచలం వైపు కారులో రూ.2.30 లక్షలు తీసుకెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. నగదుకు ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై శ్రీకాంత్

సింగరేణి ఇనుప సామగ్రి స్వాధీనం

సింగరేణి(కొత్తగూడెం): చంద్రుగొండ మండలం తిప్పనపల్లిలోని రైస్ మిల్లులో మంగళవారం సింగరేణికి చెందిన 4 టన్నుల చానల్స్(ఇనుప సామగ్రి) కార్పొరేట్ ఏరియా మొబైల్ టీం పట్టుకుంది. సెక్యూరిటీ ఉన్నతాధికారులు విచారించగా ఆ సామగ్రి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 గని నుంచి తరలించిందేనని తేలింది. కాగా ఈ సామగ్రి విలువ రూ. 3 లక్షల వరకు ఉండవచ్చని అంచనా. కార్పొరేట్ ఏరియాకు చెందిన సిబ్బంది సామగ్రిని పట్టుకుంటే ఏరియాలో ఉన్న స్పెషల్ టీమ్, ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఏమి చేస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సామగ్రి ఎలా వెళ్లింది, తరలింపులో ఎవరెవరి పాత్ర ఉందనే విషయాలు తేలాలంటే పోలీస్‌శాఖతో దర్యాప్తు చేయించాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.



తిప్పనపల్లిలో ఇనుప సామగ్రి పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది, అధికారులు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సుజాతనగర్: ఐదు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తిపై సుజాతనగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ కథనం ప్రకారం.. సీతంపేట బంజర గ్రామానికి చెందిన బాదావత్ శివకృష్ణ, కృష్ణవేణిలకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లపాటు సజావుగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో శివకృష్ణ 5 నెలల క్రితం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వెతుకుతున్నా ఆచూకీ లభ్యం కాలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

78 కేజీల గంజాయి సీజ్

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని కూనవరం రోడ్‌లో బుధవారం పోలీసులు 78 కిలోల గంజాయి పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీఏ చెక్ పోస్ట వద్ద ఎస్సై పీవీఎన్ రావు, సిబ్బంది వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో వరంగల్‌కు చెందిన కందిపెల్లి మహేష్, అందాసు, హరిష్ కారులో 40 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వెనుకాలే వస్తున్న మరో కారులో 38 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఒడిశాకు సంజీవ్ కుమార్ ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లోని సీలేరు వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్ ఓల్డ్ సిటీలో నందక్క అనే మహిళకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయి తరలిస్తున్నవారితోపాటు కారు ఓనర్లపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.19.5 లక్షలు ఉంటుందని అంచనా. రెండు కార్లు, సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నాగరాజు తెలిపారు. కాగా సీలేరుకు చెందిన పంగి బాబు, కూర పూర్ణ, సునీల్ అనే మరో ముగ్గురు పారిపోయినట్లు సమాచారం.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు అర్థంతరంగా నిలిచిన నేపథ్యాన ఇప్పటికే బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లనైనా రిలీవ్ చేయాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఈఓ సోమశేఖరశర్మకు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు, కొందరి వ్యక్తిగత స్వార్థంతో బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయాయని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రభుత్వమే చొరవతీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి వెంకన్న, షేక్ రంజాన్, వల్లంకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ప్రథమ వర్ధంతి సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు చావా దుర్గాభవాని, జియావుద్దీన్, మహబూబ్‌అలీ, నర్సింహారావు, రాజశేఖర్, వీరబాబు, మాధవరావు, ఆనందాచారి పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

రెండు నాటు తుపాకులు స్వాధీనం

నలుగురు వ్యక్తుల అరెస్ట్

జూలూరుపాడు: రెండు తుపాకులతో పారిపోతున్న నలుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ కథనం ప్రకారం.. మండలంలోని సురారంలో పోలీసులు బుధవారం రాత్రి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సురారం అటవీ ప్రాంతంలోకి నలుగురు వ్యక్తులు తుపాకులతో పారిపోతున్నారు. గమనించిన పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించారు. అటవీ జంతువులను వేటాడే వీరు కొన్ని నెలల క్రితం చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన భూక్యా హరి వద్ద రూ.4 వేల చొప్పున రెండు నాటు తుపాకులను కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపడుతుండగా, భయపడి అటవీలో దాచి పెట్టేందుకు వెళ్తూ పట్టుబడ్డారు. నిందితులు జూలూరుపాడు మండలం నల్లబండబోడు గ్రామానికి చెందిన ముక్తి నరసింహారావు, ఏన్కూరు మండలం నాచారానికి చెందిన భాగం కన్నయ్య, సురారానికి చెందిన గడ్డి రాములు, చంద్రుగొండ మండలం బెండాలపాడుకు చెందిన గుర్రం మునయ్యలను పోలీసులు అరెస్టు చేశారు. తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ముక్తి నరసింహారావు నల్లబండబోడు సర్పంచ్. జూలూరుపాడు సీఐ శ్రీనివాస్, చంద్రుగొండ ఎస్‌ఐ మాచినేని రవి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రూ.6 వేల విలువైన మద్యం పట్టివేత

రఘునాథపాలెం: మండల కేంద్రంలో ఎన్నికల విభాగం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, రఘునాథపాలెం సీఐ శ్రీధర్ ఆధ్వర్యాన బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వరాలు అనే వ్యక్తి కిరాణం షాపులో రూ.6 వేల విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పాతర్లపాడులో...

చింతకాని: మండలంలోని పాతర్లపాడులో ఓ షాపు నుంచి పోలీసులు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని పద్మ నిర్వహిస్తున్న షాపులో తనిఖీ చేయగా, రూ.16,380 విలువైన మద్యం లభించడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డెంగీతో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: డెంగీ బారిన పడిన వ్యక్తి ఆరోగ్యం విషమించడంతో మృతి చెందాడు. మండలంలోని ఎర్రగడ్డకు చెందిన బత్తుల నవీన్ (43) కుమారుడి చదువు కోసం కుటుంబంతో సహా ఖమ్మంలో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా ఆయనకు జ్వరం వస్తుండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మంగళవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు.

‘ఫాక్స్‌కాన్’ వలలో యువత

- యాప్ పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం
- రూ.2.5 కోట్లు కాజేసిన వైనం
- లబోదిబోమంటున్న బాధితులు

దమ్మపేట : సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నాయి. లక్కీ డ్రా వచ్చిందని, విలువైన వాహనాలు, వస్తువులు గెలుచుకున్నారంటూ సైబర్ నేరగాళ్లు ఆశ పెట్టి ఓటీపీ నంబరు తెలుసుకుని, అకౌంట్లలో నగదు జమ చేయించుకుంటున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాజాగా యాప్‌లో పెట్టుబడి పెడితే రోజూ కొంత మొత్తం చొప్పున నిరంతరం తిరిగి డబ్బు జమచేస్తామని నమ్మించారు. సుమారు రూ. 2.5 కోట్లు కాజేశారు. దీంతో సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో పలువురు ఫాక్స్‌కాన్ యాప్‌లో పెట్టి ఆర్థికంగా నష్టపోయారు. బుధవారం ఈ యాప్ అకస్మాత్తుగా క్లోజ్ అవడంతో లబోదిబోమంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని దమ్మపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా మూడు నెలల క్రితం ఫాక్స్‌కాన్ అనే యాప్ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది ప్లే స్టోర్‌లో అందుబాటులో లేదు. కేవలం లింక్ ద్వారా మాత్రమే ఒకరి నుంచి మరొకరికి పంపుకున్నారు. లింక్ ద్వారా యాప్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న పలువురు యువకులు పెట్టుబడి పెట్టారు. రూ.500 నుంచి ప్రారంభమై రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టవచ్చని, రూ.500 పెట్టుబడి పెడితే రోజూ రూ.12.50 చొప్పున తిరిగి వస్తాయని, యాప్ లింక్‌ను వేరొకరికి పంపి పెట్టుబడి పెట్టిస్తే, అందులో 10 శాతం కమీషన్ వస్తుందని యాప్ నిర్వాహకులు నమ్మించారు. మొదటిలో పెట్టుబడిన పెట్టిన వారికి రోజూ డబ్బులు తిరిగి పంపించారు. దీంతో నమ్మకం కుదిరి వారు మళ్లీ ఎక్కువ పెట్టుబడి పెట్టారు. వారిని చూసి మరికొందరు యువత కూడా యాప్‌లో పెట్టుబడి పెట్టారు. ఇలా 250 మంది వరకు పెట్టుబడి పెట్టి, ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపు కూడా క్రియేట్ చేసుకున్నారు. కాగా రెండు వారాల క్రితం పెట్టిన పెట్టుబడి మొత్తం 10 రోజుల్లో తిరిగి ఇస్తామని యాప్ ద్వారా ప్రచారం చేయాగా చాలామంది రూ.5 వేల నుంచి రూ. లక్ష చొప్పున రూ. 2.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. పది రోజుల గడిచినా ఎవరికీ తిరిగి రూపాయి ఇవ్వలేదు. దీంతో ఆందోళనకు గురయ్యారు. ఇంకా తిరిగి వస్తాయనే ఆశతో ఎదురుచూస్తుండగా మంగళవారం రాత్రి ఫాక్స్‌కాన్ యాప్‌ను ఆన్‌లైన్‌లో పూర్తిగా క్లోజ్ చేశారు. టెక్నికల్ సమస్యగా భావించిన పెట్టుబడిదారులు, వేచిచూసి బుధవారం యాప్‌ను ఓపెన్ చేయడానికి ప్రయత్నించిన సాధ్యం కాలేదు. దీంతో తాము తీవ్రంగా మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకురాలేదు.

ఎస్‌ఏ–1 పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్

ఉపాధ్యాయులే మాల్ ప్రాక్టీస్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ తల్లిదండ్రుల ఆవేదన

మణుగూరు టౌన్: 10వ తరగతి ఎస్‌ఏ–1(సమ్మెటీవ్ అసెస్‌మెంట్) ప్రశ్నపత్రాలు బిట్ పేపర్ సహా పరీక్షకు ముందే సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఫిజిక్స్, హిందీ పరీక్ష పేపర్లు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టగా కొందరు విద్యార్థులు వాటిని మాత్రమే చదువుకుని పరీక్షలకు హాజరవుతుండటం పట్ల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తారతమ్యం లేకుండా కచ్చితంగా నిర్వహించే ఎస్‌ఏ–1 పరీక్షలు ప్రాక్టికల్ మార్కులను నిర్ధారించేందుకు ఉపయోగపడతాయి. అయితే ఉదయం 9.30 నిమిషాలకు తెరవాల్సిన పరీక్ష పత్రాల బండిల్స్‌ను అంతకుముందు రోజే తెరచి ప్రశ్నపత్రాలను పాఠశాల విద్యార్థులకు ఇస్తున్నట్లు సమాచారం. బిట్ పేపర్లలో సమాధానాలు పెట్టి మరీ సామాజిక మాధ్యమాల్లో దర్శనమిస్తుండటంతో ఉపాధ్యాయులే విద్యార్థులను మాల్ ప్రాక్టీస్‌కు ప్రోత్సహిస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎంఈఓ పర్యవేక్షణ లేకపోవడంతోనే ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయని, డీఈఓ స్పందించి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఈ విషయమై ఎంఈఓ వీరాస్వామిని వివరణ కోరగా.. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



లీకైన హిందీ ప్రశ్నపత్రం

ఉత్తమ విద్యార్థులకు జాతీయ పురస్కారాలు

బూర్గంపాడు: ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జాతీయ ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సులోచనారాణి తెలిపారు. బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్‌లో 973 మార్కులు సాధించిన సుంకర మేఘన, 971 మార్కులు సాధించిన కోట అక్షయ, తెల్లబోయిన శిరీష, 948 మార్కులు సాధించిన షేక్ ముబీనాలకు పురస్కారాలను అందించారు. జాతీయ ప్రతిభా పురస్కారాల కింద డిగ్రీ, పీజీ చదువుల కోసం ఏటా రూ. 10వేల ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ చీన్యా, సీహెచ్ నాగేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలను అందిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి

చంద్రుగొండ జెడ్పీటీసీకి బీఆర్‌ఎస్ వల

అశ్వారావుపేట/చంద్రుగొండ: చంద్రుగొండ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొడకండ్ల వెంకటరెడ్డిని బీఆర్‌ఎస్‌లో చేర్చుకునేలా ఆ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఆయనతో కీలక పదవుల్లో ఉన్న కొందరు చర్చించగా... ఎంపీ నామా నాగేశ్వరరావు అనుచరులు సైతం కొడకండ్ల వెంకటరెడ్డిని కలిసి బీఆర్‌ఎస్‌లో చేరాలని కోరినట్లు సమాచారం. చంద్రుగొండ మండల కాంగ్రెస్‌లో కొందరికి ఇచ్చిన పదవుల విషయంపైనే కాకుండా ఇతర నియోజకవర్గాల నాయకులు పెత్తనంపై వెంకటరెడ్డి కొన్నాళ్లుగా అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యాన ఖమ్మంలో తాజాగా జరిగిన సమావేశంలో ‘మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.. ఒకవేళ అశ్వారావుపేట ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినా.. మీకు పార్టీలో ప్రాధాన్యం ఉంటుంది. చంద్రుగొండ మండలానికి బీఆర్‌ఎస్‌కు పటిష్ట నాయకత్వం లేనందున మీ వంటి సీనియర్ మాకు కావాలి’ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు ఆయనతో చెప్పినట్లు తెలిసింది. ఈ విషయమై వెంకటరెడ్డితో మాట్లాడగా కాంగ్రెస్ అగ్ర నాయకత్వం వైఖరిపై అసంతృప్తితో ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి తనకు బంధువేనని.. ఆయన కూడా మాట్లాడిన విషయం నిజమేనని తెలిపారు.



వెంకటరెడ్డి

హైకోర్టు జడ్జీలుగా నలుగురి పేర్లు సిఫారసు

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు నలుగురు న్యాయవాదుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు చేసిన వారిలో హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నూనేపల్లి హరినాథ్, న్యాయవాది మండవ కిరణ్మయి, ప్రభుత్వ న్యాయవాదిగా వ్యవహరిస్తున్న జగడం సుమతి, న్యాయవాదిగా ఉన్న న్యాపతి విజయ్ ఉన్నారు. ఈ నలుగురి పేర్లకు కేంద్రం ఆమోదముద్ర వేసిన తరువాత ప్రధానమంత్రి కార్యాలయం ద్వారా రాష్ట్రపతికి చేరతాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర తరువాత వీరి పేర్లను నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేస్తుంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి 22న హైకోర్టు అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా (ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తి) నేతృత్వంలోని కొలీజియం ఏడుగురు న్యాయవాదుల పేర్లను హైకోర్టు న్యాయమూర్తి పోస్టులకు సిఫారసు చేసింది. హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్, యర్రంరెడ్డి నాగిరెడ్డి, ఎస్.రవిప్రసాద్, అశ్వత్థనారాయణ పేర్లను సుప్రీంకోర్టుకు పంపింది. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి కూడా ఈ పేర్లపై తమ అభిప్రాయాలు పంపారు. అనంతరం కేంద్ర హోంశాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ద్వారా రహస్య విచారణ జరిపి ఈ ఏడుగురి వివరాలు తెప్పించుకుంది. ఫిబ్రవరి నుంచి ఈ ఏడుగురి పేర్లు కేంద్రం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ఈ ఏడుగురి పేర్లను కేంద్ర న్యాయశాఖ సుప్రీంకోర్టుకు పంపింది. ఈ ఏడుగురి పేర్లపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన కొలీజియం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైంది. అంతకుముందే ఈ ఏడుగురి గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో గతంలో న్యాయమూర్తులుగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారి అభిప్రాయాలు కూడా తీసుకుంది. మంగళవారం జరిగిన కొలీజియం సమావేశంలో హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్ పేర్లకు ఆమోదం తెలిపింది. న్యాయమూర్తులుగా ఈ నలుగురిని నియమించే విషయంలో వీరి నైతికనిష్ఠకు సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి ప్రతికూల నివేదికలు లేవని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నలుగురు హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం అయ్యేందుకు అన్ని రకాలుగా అర్హులని స్పష్టం చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి మాత్రం న్యాపతి విజయ్ విషయంలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని కొలీజియం తన తీర్మానంలో పేర్కొంది. ఏడుగురిలో మిగిలిన ముగ్గురి విషయంలో సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం ఏమిటన్నది ప్రస్తుతానికి తెలియరాలేదు. ప్రస్తుతం హైకోర్టులో సీజేతో సహా 27 మంది న్యాయమూర్తులున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు సిఫారసు చేసిన నలుగురి పేర్లకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 31కి చేరుకుంటుంది.

ఇన్నర్ కేసులో చంద్రబాబుకు తాత్కాలిక ఊరట

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పులో అక్రమాలు, క్విడ్ ప్రోకో ఆరోపణలపై సీఐడీ నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు బుధవారం తాత్కాలిక ఊరటనిచ్చింది. ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్‌లో తదుపరి ముందుకెళ్లొద్దని విజయవాడ ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 16వరకు పీటీ వారెంట్ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో తదుపరి ఎలాంటి సమయం ఇచ్చే ప్రసక్తేలేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవేళ సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో ఏదైనా కేసులో వాదనలు వినిపించాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గడువునివ్వడం సాధ్యమవుతుందని తేల్చి చెప్పారు.

‘రింగ్’ మాస్టర్ అష్ట వంకర్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో లోకేశ్‌కు సీఐడీ ప్రశ్నల వర్షం

- ‘ఉప సంఘం’ వ్యవహారంపై ప్రశ్నలకు తడబాటు
- హెరిటేజ్ భూముల అంశంపై ప్రశ్నలకు బిత్తరచూపులు
- కరకట్ట నివాసంపై ప్రశ్నించేసరికి కస్సుబుస్సు
- విలేకరుల సమావేశంలోనూ అదే తీరు
- ‘సాక్షి’పై అసత్య ఆరోపణలతో విషయాన్ని పక్కదారి పట్టించే యత్నం
- ఇతర విలేకరుల ప్రశ్నలకు చిందులు..
- నేనెక్కడికి వెళ్తానో మీకనవసరం అంటూ అసహనం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎన్ని వంకర్లు తిప్పారో.. ఆ కేసులో నిందితుడు నారా లోకేశ్ సీఐడీ విచారణలో ప్రశ్నలకు అన్ని వంకర్లు తిరిగారు. చంద్రబాబు కుటుంబం, ఆయన అస్మదీయుల భూము ల విలువ అమాంతంగా పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చిన తీరుపై సీఐడీ అధికా రులు అడిగిన సూటి ప్రశ్నలకు లోకేశ్ నేల చూపులు చూశారు. తాను సభ్యుడిగా ఉన్న మంత్రివర్గ ఉప సంఘం ద్వారానే అక్రమాల కథ నడిపిన తీరును సీఐడీ ఆధారాలతో సహా ముందు పెట్టడంతో బిత్తరపోయారు. హెరిటేజ్ భూముల కొనుగోలు, లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట నివాసంపై ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయారు. విచారణకు సహకరించకుండా దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు యత్నించారు.

ఈ కేసులో ఏ–14గా ఉన్న లోకేశ్‌ను సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వరుసగా రెండో రోజు బుధవారం తాడేపల్లిలోని సీఐడీ కార్యాలయంలో విచారించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ దర్యాప్తునకు సహకరించకుండా ఉండేదుకు లోకేశ్ అనేక ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ సిట్ బృందం తమదైన శైలిలో కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయన న్యాయవాది సమీప దూరంలో ఉండగా ఆడియో, వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ అధికారులు లోకేశ్‌ను విచారించారు. విశ్వసనీయ సమచారం ప్రకారం ఈ దర్యాప్తునకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అలైన్‌మెంట్ మార్చాలని ఎందుకు ఒత్తిడి చేశారు?

ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు అమరావతి కోర్ కేపిటల్‌పై టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గ ఉప సంఘం ద్వారా అక్రమాల కథ నడిపిన తీరుపై సీఐడీ లోకేశ్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. జూనియర్ మంత్రి అయినప్పటికీ లోకేశ్‌కు ఉప సంఘంలో స్థానం కల్పించడంపై మొదటగా ప్రశ్నించింది. పేరుకు మంత్రివర్గ ఉప సంఘం అయినప్పటికీ ఇతర సభ్యులకంటే అందులో లోకేశ్, నారాయణదే హవా అని, భూ సమీకరణ, ఇన్నర్‌రింగ్ రోడ్డుకు భూసేకరణపై వీరే కీలకంగా వ్యవహరించినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. వాటిని లోకేశ్‌కు చూపిస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని సీఆర్‌డీఏ అధికారులపై ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించింది. తామేమీ ఒత్తిడి చేయలేదని లోకేశ్ బుకాయించారు. మంత్రివర్గ ఉపసంఘం, టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే అలైన్‌మెంట్‌ను మార్చినట్లు అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వాంగ్మూలం ఇచ్చిన అంశాన్ని సీఐడీ అధికారులు ప్రస్తావించడంతో లోకేశ్ షాక్ తిన్నారు. దాంతో ఆయన నోట మాట రాలేదని సమాచారం. వెంటనే తన న్యాయవాదితో సంప్రదించి చెబుతానని చెప్పారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా ఆయన ఈ అంశంపై సమాధానం దాట వేసేందుకే ప్రయత్నించారు. ముందుగానే సీఆర్‌డీఏ అధికారులతో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేయించి, దానినే మాస్టర్‌ప్లాన్‌లో చేర్పించి సింగపూర్‌కు చెందిన కన్సల్టెన్సీ ద్వారా ఆమోదింపజేయడం అంటే అక్రమమే కదా అని అధికారులు ప్రశ్నించడంతో లోకేశ్ మౌనంగా ఉండిపోయారు. మంత్రివర్గ ఉప సంఘం వ్యవహారం అంతా బూటకమని, ఆ ముసుగులో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతంగా పెంచుకున్నారని సీఐడీ కీలక ఆధారాలు చూపించడంతో లోకేశ్ నిశ్చేష్టుడయ్యారు.

కరకట్ట నివాసం అంశంపై కస్సుబుస్సు

లింగమనేని కుటుంబం నుంచి క్విడ్‌ప్రోకో కింద పొందిన కరకట్ట బంగ్లాపై సీఐడీ ప్రశ్నించడంతో లోకేశ్ తత్తరపాటుకు గురై అధికారులపై కస్సుబుస్సులాడారు. ఆ ఇంటికి తాము అద్దె చెల్లించామన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు చూపిస్తూ ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌ను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దర్యాప్తులో భాగంగా ఏ పత్రాలనైనా సంబంధిత శాఖలను సంప్రదించి తీసుకునే వెసులుబాటు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలకు ఉందనే అవగాహన ఆయనకు లేకపోవడం విడ్డూరం. లింగమనేని రమేశ్ ఆ కరకట్ట నివాసాన్ని ఉచితంగా ఇచ్చానని ఓసారి, కాదు దేశభక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చానని మరోసారి చెప్పిన విషయాలను అధికారులు ప్రస్తావించారు. దాంతో అసలు తనకు ఆ కరకట్ట నివాసం గురించి తెలియదని లోకేశ్ బుకాయించారు. మంత్రి హోదాలో మీరు నివసించిన ఇంటి గురించి తెలియదా అని అధికారులు రెట్టించి అడిగేసరికి సమాధానం దాటవేశారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి మరికొన్ని కీలక వ్యవహారాలపై లోకేశ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. కానీ ఆయన నుంచి సరైన సమాధానం రాలేదు. వీలైనంతవరకు దర్యాప్తునకు సహకరించకుండా విషయాన్ని పక్కదారి పట్టించేందుకే లోకేశ్ యత్నించారు. పలువురు అధికారుల పేర్లను ప్రస్తావిస్తూ వారిని ప్రశ్నించాలని సీఐడీకి సూచించడం హాస్యాస్పదంగా మారింది. దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన నిందితుడు తిరిగి ఇతరలను ప్రశ్నించాలని చెబుతుండటం విడ్డూరంగా ఉందని సీఐడీవర్గాలు వ్యాఖ్యానించాయి. అవసరమైతే మరోసారి విచారణకు రావల్సి ఉంటుందని సీఐడీ అధికారులు లోకేశ్‌కు చెప్పి బుధవారం విచారణ ప్రక్రియను ముగించారు.

హెరిటేజ్ భూముల అంశంపై అసహనం..

- ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని హెరిటేజ్ ఫుడ్స్ భూములు కొన్న అంశంపై సీఐడీ సూటి ప్రశ్నలకు లోకేశ్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఏ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో భూములు కొనాలని హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. ప్రస్తుతం తాను హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా లేనని, ఆ విషయాలు తనకు తెలియవని అన్నారు. భూములు కొనాలని తీర్మానించిన సమయంలో మీరే డైరెక్టర్‌గా ఉన్నారు కదా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేయడం గమనార్హం.

సంబంధం లేని ప్రశ్నలువేశారు: లోకేశ్

సీఐడీ అధికారులు తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేశారని లోకేశ్ చెప్పారు. రెండో రోజు విచారణ అనంతరం సీఐడీ కార్యాలయం బయట మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని ఈ విచారణ ద్వారా తనకు తెలిసిందన్నారు. కరకట్ట నివాసానికి తన తల్లి అద్దె చెల్లించారన్నారు. తన తల్లి ఆదాయ పన్ను రిటర్న్‌లను అధికారులు ఎలా సేకరిస్తారని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. సాక్షి పత్రికలో షేర్లను కొందరు కొన్నట్లుగా తమ హెరిటేజ్ ఫుడ్స్ షేర్లను లింగమనేని కొనలేదని వ్యాఖ్యానించారు.

‘సాక్షి’ ప్రశ్నలకు తత్తరపాటు

ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణంలో లోకేశ్ పాత్రపై ‘సాక్షి’ ప్రతినిధులు ప్రశ్నించడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. సాక్షి పత్రికపై అసత్య ఆరోపణలు చేసి విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. కానీ సాక్షి ప్రతినిధులు సూటి ప్రశ్నలు సంధించడంతో తత్తరపాటుకు గురయ్యారు. ఇతర మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లోకేశ్‌తో సాక్షి, ఇతర మీడియా ప్రతినిధుల సంభాషణ ఇలా సాగింది..

- **సాక్షి:** మీరు మంత్రివర్గ ఉప సంఘంలో సభ్యుడయ్యాకే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చారని, హెరిటేజ్‌ఫుడ్స్‌కు భూములు కొన్నారన్న అభియోగంపై స్పందన ఏమిటి?
- **లోకేశ్:** మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడిగా నేను ఒత్తిడి చేసి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశానని సీఐడీ అంటోంది. కానీ అది నా శాఖకు ప్రమేయం లేని అంశం. అదే చెప్పా.
- **సాక్షి:** ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉన్న కంతేరు వైపు ఎందుకు మళ్లింది?
- **లోకేశ్:** సీఐడీ అధికారులు నాకు బాహుబలి సినిమా చూపించారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ గూగుల్ మ్యాప్ చూపించి ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మిస్తే హెరిటేజ్ ఫుడ్స్ భూములు కోల్పోతుందని నాకు అర్థమైంది.
- **సాక్షి:** క్విడ్‌ప్రోకో కిందే లింగమనేని మీకు కరకట్ట బంగ్లా ఇచ్చారని సీఐడీ అభియోగం మోపింది కదా?
- **లోకేశ్:** మాకు క్విడ్ ప్రోకో అలవాటు లేదు. క్విడ్ ప్రోకో ద్వారా సాక్షి మీడియాలో పెట్టుబడులు పెట్టినట్టు మా హెరిటేజ్ ఫుడ్స్‌లో ఎవరూ పెట్టుబడులు పెట్టలేదు.
- **సాక్షి:** మరి మీకు మాత్రమే లింగమనేని ఆ కరకట్ట బంగ్లాను ఎందుకు ఇచ్చారు?
- **లోకేశ్:** ఆ ఇంటికి మేము అద్దె చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ఆ మేరకు లేఖ కూడా రాశాం.
- **సాక్షి:** అదే నిజమైతే 2019కు ముందు ఎందుకు అద్దె చెల్లించలేదు?
- **లోకేశ్:** (వెంటనే సమాధానం చెప్పలేక మౌనం వహించారు. కాసేపటికి తేరుకుని..) ఆ విషయం నాకు తెలీదు. నాకు తెలిసినంతవరకు ఇప్పుడు అద్దె చెల్లిస్తున్నాం. మా అమ్మ ఐటీ రిటర్న్ రికార్డులు సీఐడీకి ఎలా వచ్చాయి? దీనిపై న్యాయపోరాటం చేస్తాం.
- **సాక్షి:** మీ సన్నిహితుడు కిలారు రాజేశ్ ఎందుకు పరారయ్యారు?
- **లోకేశ్:** ఆయన గురించి నాకేం తెలుస్తుంది? ఎక్కడ ఉన్నారో నాకు తెలీదు
- **ఇతర మీడియా ప్రతినిధులు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జైలుకు పంపారు అని మీరు అంటున్నారు. జ్యుడీషియల్ రిమాండ్ విధించేది కోర్టులు కదా?
- **లోకేశ్:** ఈ కేసులో ఎఫ్ఐఆర్ వేసింది జగన్ ప్రభుత్వమే.అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు.
- **మీడియా ప్రతినిధులు:** మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లిపోతారా?
- **లోకేశ్:** నేను ఎక్కడికి వెళ్తానో మీకు చెప్పాలా? అది మీకు అనవసరం. నేను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని. ఎక్కడికి వెళ్లినా షెడ్యూల్ ఇస్తా.

జిల్లా వార్తలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం



కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌జేడీ, తదితరులు

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల నుంచి సన్నబియ్యం సరఫరా అవుతాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.ఝాన్సీలక్ష్మిబాయి తెలిపారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆమె ప్రీ స్కూల్ కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశమైన ఝాన్సీలక్ష్మిబాయి మాట్లాడుతూ.. కేంద్రాల్లో లబ్ధిదారులకు సక్రమంగా పోషకాహారం అందజేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఫ్లెక్సీలపై రాజకీయ నాయకుల ఫొటోలు కనిపించకుండా మూసివేయాలని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక





రూప, మధులత, జ్యోతిర్మయి గోపి

బోనకల్: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బోనకల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల ఆర్మూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పాటు కె.రూప, కె.మధులత, టి.జ్యోతిర్మయి, జి.గోపిని ఎంపిక చేశారు. వారు ఈ నెల 15 నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ అమిరేసి లింగయ్య బుధవారం వెల్లడించారు.

రేపటి నుండి గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్

ములకలపల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ములకలపల్లి గురుకులంలో శుక్రవారం నుండి నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. మండల కేంద్రంలోని గురుకులంలో బుధవారం ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 14 కళాశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థినులు అండర్ -14, 17, 19 విభాగాల్లో పోటీల్లో తలపడతారని వెల్లడించారు.

కేంద్ర నిధులు పక్కదారి

- పేరు మార్చుకుంటే బీఆర్‌ఎస్ జాతీయ పార్టీ కాదు..
- డబ్బులు మోదీవి.. ఫొటోలు కేసీఆర్‌వి
- కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ



సత్తుపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ, పక్కన నాయకులు

సత్తుపల్లి: రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తూ.. మోదీ ఫొటోల స్థానంలో కేసీఆర్ ఫొటోలు పెట్టుకుంటున్నారని కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ విమర్శించారు. సత్తుపల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో సింగరేణి బాంబుపేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్ల బాధితులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సింగరేణిలో 49శాతం వాటా కేంద్ర ప్రభుత్వం ఉన్నందున బాధితుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. పేదవాడి బిడ్డకే పేదల కష్టం తెలుస్తుంది.. ఇళ్లు ఎప్పుడు కూలిపోతాయేనని భయపడుతూ జీవిస్తున్న బాధితులను చూస్తుంటే తన చిన్నతనంలో ఇల్లు గుర్తుకు వచ్చిందని భావోద్వేగానికి లోనయ్యారు. కాగా, రాష్ట్రంలోని నాయకత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య పరిష్కరించడం లేదని ఆరోపించారు. టీఆర్‌ఎస్ పార్టీ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చినంత మాత్రాన జాతీయ పార్టీ కాదని ఎద్దేవా చేశారు.

వెనుకబడిన వర్గాల కోసం ‘విశ్వకర్మ’

వేంసూరు/కల్లూరు/పెనుబల్లి: వెనుబడిన వర్గల వారికి అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించారని కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. వేంసూరు, కల్లూరు, పెనుబల్లి మండలాల్లో ఆయన పర్యటించగా.. వేంసూరులో హైవే పనులను పరిశీలించిన సందర్భంగా పలువురు రైతులు కలిసి సర్వీసు రోడ్డు ఇవ్వాలని కోరారు. ఆతర్వాత ఆయన మాట్లాడుతూ 18 కులాల చేతి వృత్తిదారులు సీఎస్‌పీ సెంటర్‌కు వెళ్లి పేరు నమోదు చేసుకుంటే విశ్వకర్మ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈపథకం ద్వారా రూ.5శాతం వడ్డీ రాయితీతో ఎలాంటి పూచీకత్తు లేకుండా విడదల వారీగా రుణాలు మంజూరవుతాయని చెప్పారు. అలాగే, కల్లూరులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వర్మ మాట్లాడగా పెనుబల్లి బీసీ కాలనీలోని కుమ్మరి వృత్తిదారుడు వీరస్వామి ఇంటి వద్ద కుండల తయారీని పరిశీలించారు.

ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణతో పాటు నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, పాలకొల్లు శ్రీను, ఆచంటి నాగస్వామి, పడిగల మధు లంబాడీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, త్రిలోక్, ఉమారాణి, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, పర్స రాంబాబు, గుమ్మా రామకృష్ణ, గుండపనేని అనిల్, తుమ్మలపూడి పుల్లారావు, పానుగంటి కృష్ణయ్య, ఆమనమంచి కృష్ణమోహన్, వినయ్, త్రినాథ్, కనగాల వెంకట్రామయ్య, బొర్రా నరసింహారావు, నాయుడు రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ మార్గాల్లో చెక్‌పోస్టులేవి?

- అక్రమార్కులకు రాజమార్గంగా దారులు
- కొన్ని ప్రాంతాలను విస్మరించడంపై విమర్శలు



అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి ఏపీలోకి వెళ్లే మార్గం

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటుచేశారు. ఈ చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు చేపడుతుండగా రూ.లక్షల్లో నగదు పట్టుబడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా మరికొన్ని మార్గాలను విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ఆయా రహదారులను అక్రమార్కులకు రాజమార్గాలుగా ఎంచుకున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రెండు రాష్ట్రాల సరిహద్దు

తెలంగాణ – ఏపీ సరిహద్దులోని అశ్వారావుపేట నియోజకవర్గానికి ఆనుకుని ఏపీలోని ప్రాంతాలు ఉంటాయి. నియోజకవర్గ కేంద్రానికి చుట్టూ ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, చింతలపూడి మండలాల్లోని గ్రామాలు ఉండగా.. అశ్వారావుపేట నుంచి జీలుగుమిల్లి, అశ్వారావుపేట మండలంలోని నందిపాడు, కొత్తూరు గ్రామాల నుంచి ఏపీకి జాతీయ రహదారులు ఉంటాయి. అయితే, పోలీస్ శాఖ కేవలం మూడు చోట్ల మాత్రమే చెక్ పోస్టులు ఏర్పాటుచేసింది. ఇందులో నందమూరినగర్(అశ్వారావుపేట) చెక్ పోస్టు వద్ద రెండు రోజుల వ్యవధిలోనే రూ.6.91లక్షల నగదు పట్టుబడింది.

చెక్‌పోస్టులు లేని మార్గాలివే..

అశ్వారావుపేట మండలం నుంచి ఏపీలోకి ప్రవేశించేందుకు, ఇటు వచ్చేందుకు మూడు ప్రధాన రహదారులతోపాటు మరికొన్ని మార్గాలు కూడా ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక సరిహద్దు ప్రాంతాలైన అశ్వారావుపేట, నందిపాడు, కొత్తూరు వద్ద మాత్రమే చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. అయితే, అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి ఏపీలోని జీలుగుమల్లి మండలం కామయ్యపాలెం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గాలు ఉన్నాయి. అలాగే, అశ్వారావుపేట మండలం రామన్నగూడెం నుంచి ఏపీలోని జీలుగుమల్లి మండలం రాచన్నగూడెం నుంచి ఏపీలోకి, అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం క్రాస్ రోడ్ మీదుగా ఏపీలోని చింతలపూడిలోకి వెళ్లేందుకు సింగిల్ బీటీ రహదారులు ఉన్నాయి. వీటిలో ఎక్కడ కూడా చెక్‌పోస్టులు కానరావడం లేదు. ప్రధానంగా పాపిడిగూడెం మార్గాన్ని అక్రమార్కులు డబ్బు, మద్యం సరఫరాకు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ మార్గంలోనే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులు నగదు తరలిస్తుండగా రూ.14లక్షలకు పైగా స్వాధీనం చేసుకున్నారు. అయినా ఈసారి ఎన్నికల వేళ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయకపోవడం గమనార్హం. ఈవిషయమై తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులు గుర్తించిన ప్రాంతాల్లోనే చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, మిగతాచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా ఉంటుందని తెలిపారు.

ఈ దసరాకైనా ఇస్తారా ?!

- ఇన్సెంటివ్ కోసం జెన్‌కో ఉద్యోగుల ఎదురుచూపులు
- ఐదేళ్ల నుంచి కోరుతున్నా ఫలితం సున్నా



పాల్వంచలోని కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏటా రావాల్సిన ఇన్సెంటివ్‌ను యాజమాన్యం విడుదల చేయడం లేదు. ఈ అంశంపై అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల బాధ్యులు యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఏటా దసరాకు రావాల్సిన ఇన్సెంటివ్ విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ దసరా పండుగ నాటికైనా ఇస్తారా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రతీ సంవత్సరం 15 రోజుల వేతనాన్ని ఇన్సెంటివ్‌గా అందించే సంస్థ ఐదేళ్లుగా ఇవ్వక పోవడంతో నిరాశతో ఉన్నారు. ఇదిలా ఉండగా ప్రతినెల ఒకటి, రెండో తేదీల్లో రావాల్సిన వేతనం 10వ తేదీ నుంచి 15వ తేదీ మధ్యలో ఇస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ విడుదల

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు గత జూలై నెల నుండి పెండింగ్‌లో ఉన్న డీఏ(కరువు భత్యం) విడుదలైంది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు 2.88 శాతం డీఏను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనుండగా.. అక్టోబర్ నెలకు సంబంధించి నవంబర్‌లో వచ్చే వేతనంతో చెల్లిస్తారు. ఈ మేరకు జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా.. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు వజీర్, డి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మేనిఫెస్టో విడుదలైతే పండుగే..



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎంపీ కవిత, పక్కన ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

- మహబూబాబాద్ ఎంపీ కవిత
- ఇల్లెందులో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ఈ నెల 15న ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించనున్నారని.. అన్ని వర్గాల ప్రజల కోసం ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలకు తోడు కొత్తవి ప్రకటించనున్న నేపథ్యాన మరోమారు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత స్పష్టం చేశారు. ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరగగా, ప్రతీ ఇంటికి అభివృద్ధి ఫలాలు అందాయని తెలిపారు. ఈ మేరకు ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి మూడో దఫా కూడా కేసీఆర్‌ను సీఎంగా చేయాలని కోరారు. కాగా, ఇల్లెందు నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనట్లుగా అభివృద్ధి జరిగిందని, 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఐటీఐ మంజూరయ్యాయని చెప్పారు. కాగా, నవంబర్ 1వ తేదీన ఇల్లెందులో జరిగే సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇల్లెందులో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తనను గెలిపించాలని కోరారు. తొలుత సీఎం కేసీఆర్ సభ ఏర్పాటుచేసే సింగరేణి మైదానాన్ని పరిశీలించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగాల రాజేందర్, గార్ల ఎంపీపీ చౌహాన్, నాయకులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, జేకే శ్రీనివాస్, మనోహర్ తివారీ, తాతా గణేశ్, వరప్రసాద్, పరుచూరి వెంకటేశ్వరరావు, శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక తదితరులు ఉన్నారు.

రామయ్య సన్నిధిలో ఎంపీ పూజలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామిని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న ఆమె ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పండితులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.